సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 25 । జూన్ । 2024



వ్యసనాలకు దూరంగా ఉండాలి

చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, ఉన్నత విద్యపై దృష్టి సారించాలని పోలీసులు కోరారు. 8లో



అప్పన్నకు ఆర్జిత సేవలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. 8లో



20న గిరిప్రదక్షిణకు ఏర్పాట్లు

వచ్చేనెల 20న గిరి ప్రదక్షిణను నిర్వహించేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

27న నూతన కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లా కలెక్టర్‌గా ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఈనెల 27న బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ఈయనను ఈనెల 22న అల్లూరి జిల్లా కలెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దినేష్‌కుమార్ 2016-17లో రంపచోడవరం ఐటీడీఏగా పనిచేశారు. ఇంతవరకు కలెక్టర్‌గా పనిచేసిన ఎం.విజయ సునీతను జీఏడీకి రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పడిన తరువాత 3వ కలెక్టర్‌గా దినేష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించనుండడంతో కలెక్టరేట్ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్‌గా అప్పలస్వామి బాధ్యతల స్వీకరణ



అప్పలస్వామికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ సురేష్‌కుమార్, శాస్త్రవేత్త ఉజ్వల

చింతపల్లిరూరల్: స్థానికప్రాంతీయవ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్)ఏడీఆర్‌గా డాక్టర్ ఎ.అప్పలస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన డాక్టర్ఎం.సురేష్‌కుమార్‌ను బాపట్ల అగ్రికల్చర్ కళాశాలకు ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ బదిలీ చేశారు.అప్పలస్వామి ఇంతవరకు యలమంచిలిలోని నూనెగింజల పరిశోధన స్థానంలో ప్రిన్సిపల్ శాస్త్రవేత్త, హెడ్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ఏడీఆర్‌గా నియమితులైన అప్పలస్వామికి పూర్వ ఏడీఆర్ సురేష్‌కుమార్, శాస్త్రవేత్త సీడేరి ఉజ్వల పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

- ఇబ్బందులకు గురైన ప్రయాణికులు



సప్పర్లలో ఆగిపోయిన బస్సు

సీలేరు: విశాఖపట్నం నుంచి సీలేరు మీదుగా భద్రచలానికి రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు ఘాట్ రోడ్డులో తరచూ మొరయిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు గంటల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా సోమవారం సీలేరు నుంచి విశాఖపట్నం వెళుతున్న బస్సు సప్పర్ల వద్ద డబుల్ గేర్లు పడిపోవడం వల్ల నిలిచిపోయింది. దీంతో వెనుక వచ్చిన బస్సులో ప్రయాణికులను ఎక్కించి గమ్యస్థానాలకు పంపించారు. ఇలా తరచూ బస్సులు అడవి ప్రాంతం,ఘాట్ రోడ్డులో మొరాయిస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. గడిచిన మూడురోజుల్లో రెండు సార్లు బస్సులు మార్గమధ్యంలో ఆగిపోయాయి.

గోదావరి డెల్టాకు 'డొంకరాయి' జలాలు విడుదల




డొంకరాయి జలాశయం నుంచి విడుదల చేస్తున్న నీరు

మోతుగూడెం: సీలేరు కాంప్లెక్స్‌లోని డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టాలో రబీ పంటలకు సోమవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి రెండువేల క్యూసెక్కుల నీటిని ఏపీ జెన్‌కో అధికారులు విడుదల చేస్తున్నారు. డొంకరాయి జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి అనంతరం పవర్ కెనాల్ ద్వారా నాలుగువేల క్యూసెక్కులు గోదావరి డెల్టాకు వెళుతుండగా, మరికొంత నీరు కావాలని జల వనరుల శాఖ అధికారులు కోరడంతో విడుదల చేస్తున్నట్టు ఎస్ఈ కె.వి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం సీలేరు కాంప్లెక్స్ నుంచి గోదావరి డెల్టాకు ఆరువేల క్యూసెక్కుల నీరువెళ్తున్నట్టు ఎస్ఈ తెలిపారు. మూడు రోజులపాటు డొంకరాయి నుంచి రెండువేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తామని తరువాత, రెండు రోజులు 1500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తామని ఆయన చెప్పారు. ప్రస్తుతం బలిమెల జలాశయంలో మన వాటాతో పాటు డొంకరాయి జలాశయం నీటితో కలిపి 12.5 టీఎంసీల నిల్వలు ఉన్నాయని ఎస్ఈ తెలిపారు.

శరవేగంగా..ఏకలవ్య

చుట్టూ పచ్చని కొండల మధ్య ఆహ్లాదకరమైన విశాల ప్రాంగణాల్లో అత్యాధునిక సౌకర్యాలతో ఏకలవ్య పాఠశాలల భవన నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. గిరి పుత్రులకు గురితప్పని చదువులు అందించేందుకు రూ.640 కోట్లతో జిల్లాలకు 16 పాఠశాలలు మంజూరు చేయగా ఇప్పటికే ఐదు పాఠశాలల భవనాలు పూర్తయ్యాయి. మిగిలిన భవనాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

- జిల్లాకు రూ.640 కోట్ల వ్యయంతో 16 పాఠశాలలు మంజూరు
- ఇప్పటికే ఐదు మండలాల్లో భవనాలు పూర్తి
- 80 శాతం పనులు పూర్తయిన మరో 8 భవనాలు
- 3 ప్రాంతాల్లో త్వరలో పనులు ప్రారంభం



పెదబయలులోని ఏకలవ్య పాఠశాల భవనాలు



చింతూరులో కార్పొరేట్ స్థాయిలో నిర్మించిన ఏకలవ్య పాఠశాల భవనం

సాక్షి,పాడేరు: గిరిజన ప్రాంతాల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సిఫారసుతో కేంద్ర ప్రభుత్వం జిల్లాకు మంజూరు చేసిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు మన్యానికి వరంగా మారాయి. జిల్లాలోని 16 మండలాలలకు మూడేళ్ల క్రితం ఏకలవ్య పాఠశాలలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రతి పాఠశాల భవనాల నిర్మాణానికి రూ.40కోట్ల చొప్పున మొత్తం 16 పాఠశాలలకు రూ.640 కోట్లను మంజూరు చేసింది.దీంతో భవన నిర్మాణాలను సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ విభాగాలు చేపట్టాయి. పాడేరు,హుకుంపేట,అనంతగిరి మండలాలకు సంబంధించి స్థలాల సమస్యతో పనులకు ఆటంకం ఏర్పడగా, ఆ పనులను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. మిగిలిన భవన నిర్మాణాల పనులు శరవేగంతో జరుగుతున్నాయి.

ఐదు మండలాల్లో భవనాలు పూర్తి

జిల్లాలోని ఐదు మండలాల్లో భవన నిర్మాణాలను పూర్తి చేయడంతో ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త భవనాల్లో తరగతులు ప్రారంభం కానున్నాయి. చింతూరు,పెదబయలు,చింతపల్లి,డుంబ్రిగుడ,అరకులోయ(మజ్జివలస)మండలాల్లో భవనాలను అధునాతనంగా నిర్మించారు. కార్పొరేట్ విద్యాలయాలకు దీటుగా పూర్తిస్థాయిలో వసతి సౌకర్యాలను అందుబాటులో ఉంచారు.గిరిజన విద్యార్థులకు నాణ్యమైన చదువులతో పాటు కార్పొరేట్ వసతులు కల్పించే లక్ష్యంగా పనులు జరిగాయి. నిర్మాణాలు పూర్తి కావడంతో కొద్ది రోజుల్లో ఈ పాఠశాలల భవనాలను ప్రారంభించనున్నారు.

ఎనిమిది చోట్ల స్పీడ్‌గా పనులు

రంపచోడవరం,మారేడుమిల్లి,వై.రామవరం,ముంచంగిపుట్టు,జి.మాడుగుల,రాజవొమ్మంగి,అడ్డతీగల,కొయ్యూరు మండలాల్లోని ఏకలవ్య పాఠశాలల భవన నిర్మాణాలు శరవేగంతో జరుగుతున్నాయి.పలు పాఠశాలల్లో 70నుంచి 90శాతం వరకు నిర్మాణ పనులు జరిగాయి.ఈఏడాది అక్టోబర్, నవంబర్ నెలల నాటికి భవన నిర్మాణాలన్నీ పూర్తి చేసే లక్ష్యంతో సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ పనిచేస్తోంది. సంబంధిత ఇంజినీరింగ్ విభాగంతో పాటు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికారులు కూడా క్షేత్రస్థాయిలో తరచూ పర్యటనలు చేస్తూ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు.

అన్నదాత చెంతకు సాంకేతిక ప్రగతి



పీఎం కోటలో రబ్బరు తోటలను పరిశీలిస్తున్న డీడీజీ ఉదయ్ సింగ్ గౌతమ్

- డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఉదయ్ సింగ్ గౌతమ్
- క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులతో మాట్లాడిన డీడీజీ



పందిరిమామిడి కేవీకేలో రైతులకు మేకల యూనిట్ పంపిణీ చేస్తున్న డీడీజీ ఉదయ్ సింగ్ గౌతమ్

రంపచోడవరం: వ్యవసాయ రంగంలో వస్తున్న శాస్త్ర, సాంకేతిక మార్పులు, కొత్త పరిజ్ఞానం రైతులకు అందినప్పుడే మేలైన దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతుల సేవలో ముందుండాలని కేవీకేల డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (న్యూఢిల్లీ) డాక్టర్ ఉదయ్ సింగ్ గౌతమ్ తెలిపారు. రంపచోడవరం సమీపంలోని పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. అక్కడ కార్యక్రమాలు, శిక్షణలు, ప్రథమ పంక్తి ప్రదర్శనలను పరిశీలించారు. రైతులకు ఉపయోగపడే కార్యక్రమాల గురించి శాస్త్రవేత్తలతో చర్చించారు. అనంతరం మారేడుమిల్లి మండలం పందరిమామిడి గ్రామాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు థింసా నృత్యంతో ఆయనకు స్వాగతం పలికారు. గిరిజన రైతులు సాగు చేస్తున్న రబ్బరు చెట్లను పరిశీలించారు. రబ్బరు సాగుకు రైతులకు కావాల్సిన తోడ్పాటు గురించి చర్చించారు. రబ్బరు టాపింగ్‌కు కావాల్సిన యంత్రాలను ఉచితంగా అందజేశారు. రూ.20 లక్షల సోలార్ డ్రయర్‌ను అందజేస్తామని హామీ ఇచ్చారు. అందుకు కావాల్సిన నిధులు, అనుమతులు ఇవ్వడానికి అంగీకరించారు. డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జానకీరామ్ మాట్లాడుతూ కేవీకే ద్వారా రైతులకు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సమస్యల గురించి వివరించారు. అటారీ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా మాట్లాడుతూ కేవీకే ద్వారా పందిరి మామిడిలో నిర్వహించనున్న కార్యక్రమాలను వివరించారు. కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ లలితాకామేశ్వరి మాట్లాడుతూ పీఎం కోటలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, శిక్షణల గురించి వివరించారు. కేవీకే శాస్త్రవేత్తలు క్రాంతికుమార్, వీరాంజనేయులు, ప్రవీణ్, సర్పంచ్ మల్లీశ్వరి, జానకీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు లీజుకు దరఖాస్తుల ఆహ్వానం



పిట్టచలంలో ఐటీడీఏ నిర్మించిన హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకు

పాడేరు : కొయ్యూరు మండలం పిట్టచలంలో ఐటీడీఏ నిర్మించిన హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకు నిర్వహణకు గిరిజన ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ అర్హత కలిగిన పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పెట్రోల్ బంకు నిర్వహణకు ఎంపికైన వారికి ఐటీడీఏతో రెండేళ్ల కాలపరిమితికి ఒప్పందం ఉంటుందని తెలిపారు. లీజు పొందిన వ్యక్తి నిర్వహణ కోసం స్వయంగా పెట్టుబడి సమకూర్చుకోవాలని సూచించారు. ముందుగా ఐటీడీఏకు ఏకకాలంలో రూ.5లక్షల డిపాజిట్ చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. మొదటి ఏడాది ప్రతి నెల రూ.50వేల అద్దె, రెండో సంవత్సరం ప్రతి నెల రూ.75వేల అద్దెను ఐటీడీఏకు చెల్లించాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు దరఖాస్తుతో పాటు రూ.1లక్ష డీడీ అందజేయాలని, ఎంపిక ప్రక్రియ పూర్తయిన వెంటనే ఎంపిక కానీ అభ్యర్థుల డీడీలు తిరిగి వెనక్కి ఇస్తామని పేర్కొన్నారు. నిబంధనలకు అంగీకారం తెలిపిన అభ్యర్థులు ఈనెల 25నుంచి జులై 5వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. జులై 8న లాటరీ పద్ధతిలో అభ్యర్థిని ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9440972048 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

మరణాలపై భయాందోళనలు చెందొద్దు

- డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా
- చుట్టుమెట్టలో పర్యటించిన వైద్య బృందం
- చనిపోయిన భూత వైద్యుని ఇంటిని పరిశీలించిన అధికారులు
- గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు
- మూఢ నమ్మకాలపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జమాల్ బాషా, వైద్య నిపుణులు



చుట్టుమెట్ట గ్రామాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా, వైద్య నిపుణులు

పెదబయలు: మండలంలోని చుట్టుమెట్ట ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని, మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా తెలిపారు. ఈ నెల 19న గ్రామంలో భూతవైద్యుడు కిముడు సహదేవ్(41), మరో వ్యక్తి కిల్లో త్రినాథ్(28) హఠాత్తుగా మరణించడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురైన విషయం తెలిసిందే. దీంతో వైద్య సిబ్బంది అరడకోట పంచాయతీలోని చుట్టుమెట్టను సోమవారం సందర్శించి, వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పరిసరాలను డీఎంహెచ్‌వో పరిశీలించారు. మరణించిన సహదేవ్ ఇంటిలోపల వాతావరణాన్ని, భూత వైద్యం కోసం ఎలాంటి వనమూలికలు ఉపయోగించారనే దానిపై ఆరా తీశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకుని ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. నాటు వైద్యానికి ఉపయోగించిన మూలికలు, ఇతర సామగ్రిని ల్యాబ్‌లో పరిశీలిస్తామని చెప్పారు. పాడేరులోని జిల్లా ఆస్పత్రికి చెందిన మానసిక వైద్య నిపుణులు డాక్టర్ శివరామకృష్ణ, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ బాషీర్, కౌన్సిలర్ గీత,పెదబయలు పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని వారు సూచించారు.

32 మందికి వైద్య పరీక్షలు : చుట్టుమెట్ట నిర్వహించిన వైద్య శిబిరంలో 32 మందికి రక్తపూతలు, బీపీ,హెచ్‌బీ, వైద్య పరీక్షలు చేసినట్టు డీఎంహెచ్‌వో చెప్పారు. అందరి పరిస్థితి సాధారణంగా ఉందన్నారు. గ్రామంలో అందరూ ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం, వారిలో ఇద్దరు మరణించడంతో బాధలో కొంత మంది నీరసంగా ఉన్నారని చెప్పారు. వారికి ఓఆర్ఎస్ ప్లాకెట్లు, ఇతర మందులు అందజేసినట్టు ఆయన తెలిపారు. వారం రోజుల పాటు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమానికి జెడ్పీటీసి కూడ బొంజుబాబు తదితరులు పాల్గొన్నారు.

యథావిధిగా జన్మభూమి ఎక్స్‌ప్రెస్

తాటిచెట్లపాలెం(విశాఖ): విశాఖపట్నం-లింగంపల్లి-విశాఖపట్నం మధ్య నడిచే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ యథావిధిగా కొనసాగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ప్రకటనలో తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో జరుగుతున్న పలు భద్రతాపరమైన, ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖపట్నం-లింగంపల్లి(12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 26వ తేదీ నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు, లింగంపల్లి-విశాఖపట్నం(12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 27వ తేదీ నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు గతంలో ప్రకటించారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ రైలు యథావిధిగా నడుస్తుందని, ప్రయాణికులు మార్పును గమనించాలని కోరారు.

బడికి వెళ్లాలి...ఉన్నతంగా ఎదగాలి



పాఠశాలను ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

- పిల్లలను బడికి పంపే బాధ్యత తల్లిదండ్రులదే
- ఐటీడీఏ పీవో అభిషేక్

హుకుంపేట: బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలకు వెళ్లి ఉన్నతంగా ఎదగాలని, అందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. మండలంలోని భీమవరం పంచాయతీ మారుమూల గుమ్మడిగండువలో ఆయన సోమవారం పర్యటించారు. గ్రామంలో రూ.3.50 లక్షలతో ఆధునికీకరించిన ప్రభుత్వ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్లేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరావు, గిరిజన సంక్షేమ శాఖ ఏఈ ధృవకుమార్, ఏటీడబ్ల్యూవో రజిని,ఈవోపీఆర్డీ అప్పలరాజు,పీఆర్ జేఈ సంజీవరావు, సర్పంచ్ సైని సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు ఘన స్వాగతం

- ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా నియోజకవర్గ కేంద్రానికి రాక
- వంతాడపల్లి చెక్ పోస్టు నుంచి భారీగా ర్యాలీ



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి, సోమవారం తొలిసారిగా నియోజకవర్గ కేంద్రం పాడేరు వచ్చిన మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా విశ్వేశ్వరరాజు, ఆయన కుటుంబ సభ్యులు ఘాట్‌రోడ్డులోని మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. మండలంలోని వంతాడపల్లి చెక్ పోస్టు వద్ద నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, నాయకులు, అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరారు. స్థానిక సతకం పట్టు వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారిని దర్శించుకున్నారు. సాయిబాబా గుడి, మెయిన్ బజారు మీదుగా ర్యాలీ సాగింది. పాత బస్టాండ్ వద్ద రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మోదకొండమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి సినిమా హాల్ సెంటర్ మీదుగా ఆయన నివాసం వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో పెద్ద ఎత్తున బాణసంచాకాల్చారు. డప్పు వాయిద్యాలు, తీన్‌మార్ వాయిద్యాలు, డ్యాన్సులు, డీజే సౌండ్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పక్కాగా జీసీసీ గోడౌన్ల రికార్డులు



జీసీసీ గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

మారేడుమిల్లి: జీసీసీ గోడౌన్లలో నిత్యావసర సరకులకు సంబంధించిన రికార్డులన్నీ పక్కాగా నిర్వహించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక జీసీసీ గోడౌను రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్‌తో కలిసి ఆయన ఆకస్మికంగా సోమవారం పరిశీలించారు. ముందుగా వారు జీసీసీ గోడౌన్‌లోని బియ్యం, ఇతర నిత్యావసర సరకులను విడి విడిగా పరిశీలించారు. మండలంలోని రేషన్ డిపోలు, రేషన్ కార్డులు, ప్రతినెలా సరఫరా అవుతున్న బియ్యం తదితర వివరాల గురించి పీవో ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుదారులకు సకాలంలో రేషన్ సరఫరా చేయాలన్నారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ మారేడుమిల్లి, వై.రామవరం మండలం ఎగువ ప్రాంతాల్లోని తెల్ల రేషన్ కార్డు దారులకు ప్రతినెలా ప్రభుత్వ నిబంధనల ప్రకారం రేషన్ సరఫరా చేయాలన్నారు. రేషన్ బియ్యం సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.వి.రమణ,జీసీసీ సీనియర్ మేనేజర్ ముళ్ళ నాగ వెంకట రాజారెడ్డి, గోడౌన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన సమస్యల పరిష్కారం

- ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే
- ఐటీడీఏ పబ్లిక్ గ్రీవెన్స్‌కు 38 దరఖాస్తులు



అర్జీలు స్వీకరిస్తున్న పీవో , సబ్ కలెక్టర్

రంపచోడవరం: గిరిజనుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే తెలిపారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో వివిధ శాఖలకు చెందిన అధికారులతో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్ అండ్ మానటరింగ్ సిస్టం కార్యక్రమాన్ని రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్‌తో కలిసి ఆయన నిర్వహించారు. వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలు స్వీకరించి, కొన్నింటిని పరిష్కరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పబ్లిక్ గ్రీవెన్స్‌కు 38 దరఖాస్తులు వచ్చినట్టు చెప్పారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా పలువురు గిరిజనులు పీవో, సబ్ కలెక్టర్‌ను కోరారు. దేవీపట్నం మండలం తున్నూరు పంచాయతీ పరిధిలో గ్రామాల ప్రజలకు సెల్ టవర్ ఏర్పాటుకు ఫారెస్ట్ క్లియరెన్స్ మంజూరు చేయాలని సర్పంచ్ విజయ భాస్కర్‌రెడ్డి కోరారు. మారేడుమిల్లి మండలం వైదెపూడిలో స్కూలు భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, కొత్త భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరారు. తాడేపల్లిలో తారు రోడ్డు నుంచి సద్దిరేవులువీధి వరకు మూడు కిలోమీటర్లు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని బచ్చల బొజ్జిరెడ్డి, వలల సుగ్గిరెడ్డి, చవల సుగ్గిరెడ్డి అర్జీ అందజేశారు. పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన తొయ్యేరులో 18 మంది ముంపు బాధితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ద్వారా ఇంటి స్థలం ఏర్పాటు చేయాలని లింగంపల్లి బేబీ, రమణి, సీతమ్మ దరఖాస్తు అందజేశారు. దివ్యాంగ పింఛను మంజూరు చేయాలని రంపచోడవరం గ్రామానికి చెందిన చెరుకూరి చక్రపాణి అర్జీ అందజేశారు. నేషనల్ హైవే 516ఈ లో రోడ్డు వెడల్పులో భూమి నష్టపోవడంతో నష్టపరిహారం చెల్లించాలని గంగవరం గ్రామానికి చెందిన మడకం వెంకటరమణ దరఖాస్తు సమర్పించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

20 కిలోల గంజాయి స్వాధీనం: ముగ్గురి అరెస్టు


స్వాధీనం చేసుకున్న గంజాయి, సీజ్ చేసిన కారు, బైక్‌ను చూపిస్తున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

పాడేరు : నిషేధిత గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు పాడేరు ఎస్‌ఐ లక్ష్మణరావు సోమవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని కందమామిడి జంక్షన్ వద్ద సోమవారం వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్తున్న ఓ కారులో గంజాయి లభ్యమైందన్నారు. కారులో ఉన్న 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని గంజాయి రవాణకు ఉపయోగించిన కారు, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామన్నారు. గంజాయి తరలిస్తున్న జి.మాడుగుల మండలం మగ బూరుగు గ్రామానికి చెందిన పాంగి కృష్ణారావు, జి.మాడుగుల మండలం గద్దెరాయి గ్రామానికి చెందిన గొల్లోరి నారాయణరావు, విశాఖపట్నం ఆరిలోవ ప్రాంతానికి చెందిన అలజంగి పోలిరాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

మూఢ నమ్మకాలకు ఆదివాసీలు బలి

- అధికారుల వైఫల్యమే కారణం
- గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ



మాట్లాడుతున్న గిరిజన సమాఖ్య నాయకులు

పాడేరు రూరల్(హుకుంపేట): మూఢ నమ్మకాలకు ఆదివాసీలు బలి అవుతున్నా అధికారులు ఆదివాసులకు అవగాహన కల్పించే విషయంలో పూర్తి స్థాయిలో విఫలమవుతున్నారని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ ప్రకటనలో అన్నారు. వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతంలో భూత వైద్యులు, నాటు వైద్యాన్ని నమ్మి అనేక మంది గిరిజనులు మృతి చెందిన సంఘటలున్నాయన్నారు. ఏదైన ఒక గ్రామంలో ఘటన జరిగితే పత్రికల్లో, టీవీల్లో వస్తే రెండు, మూడు రోజుల వరకు గ్రామాల్లో అధికారులు సందర్శిస్తారే తప్ప ఆ తరువాత నుంచి ఎవరూ పట్టించుకోని పరిస్థితులున్నాయన్నారు. ఇటీవల పెదబయలు మండలం చుట్టుమెట్ట గ్రామంలో జరిగిన ఘటనపై ఆ గ్రామ ఆదివాసులకు అవగాహన కల్పించి అక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేసి మూఢ నమ్మకాలపై అధికారులు అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నేతలు అమర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తుపట్టని రీతిలో ఉన్న మృతదేహం

హుకుంపేట : మతిస్థిమితం లేని వ్యక్తి మృతదేహం సోమవారం గుర్తు పట్టని రీతిలో లభ్యమైంది. వివరాలిలా ఉన్నాయి. మెరకచింత పంచాయితీ గసరపల్లి గ్రామంలో గ్రామ శివారున ఉన్న కొండపైకి కాఫీ తోటలో కట్టెల నిమిత్తం వెళ్లిన గ్రామస్తులు పూర్తిగా కుళ్లి, గుర్తు పట్టని స్థితిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని గ్రామస్తులకు, చుట్టుపక్కల ఉన్న గ్రామస్తులకు సమాచారం అందించడంతో వారు కొండపైకి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం గుర్తు పట్టని స్థితిలో ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన నైని రామస్వామి అక్కడకు చేరుకుని ఘటనా స్థలంలో వస్త్రాలు చూసి తన తమ్ముడు అప్పలస్వామి మృతదేహంగా గుర్తించాడు. అయితే తన తమ్ముడు చిన్న వయసు నుంచే మతిస్థిమితం లేక ఊరు బయట తిరిగేవాడని, మార్చి నెల నుంచి కనబడకపోవడంతో పలు గ్రామాల్లో అతని ఆచూకీ కోసం వెతికామని తెలిపారు. సోమవారం గుర్తుపట్టని పరిస్థితుల్లో తన సోదరుడి మృతదేహం లభ్యం కావడంతో కన్నీరు మున్నీరుగా విలపించాడు. ఈ విషయన్ని స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని కేసు నమోదు చేసి ఘటన స్థలంలోనే పోస్టుమార్టం చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం జరిపారు. అనంతరం సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను బేడామండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు. భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు.

న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా సీతామాణిక్యం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య కె.సీతామాణిక్యం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆచార్య వి.విజయలక్ష్మి నుంచి ఆమె ప్రిన్సిపాల్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీతామాణిక్యంకు న్యాయ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, విశ్రాంత ఆచార్యులు అభినందనలు తెలిపారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి


డౌనూరులో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ రాజు


జి.మాడుగులలోని కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రమేష్


ఎగజనబలో యువతకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న సీఐ రమేష్, సిబ్బంది


యార్లగడ్డ ఆశ్రమ బాలికల పాఠశాలలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

జి.మాడుగుల: చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, ఉన్నత విద్యపై దృష్టి సారించాలని సీఐ రమేష్ చెప్పారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రత, క్రమశిక్షణతో చదవాలని సూచించారు. లక్ష్యసాధనతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరూ ఉన్నత విద్య అభ్యసించాలన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని డౌనూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను చింతపల్లి ఎక్సైజ్ సీఐ వై.రాజు సోమవారం సందర్శించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ఆయన విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. గంజాయి సాగు, రవాణా, సారా తయారీ, అమ్మకాలు నేరమన్నారు. చట్ట వ్యతిరేక పనులు చేసే వారికి శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐకు హెచ్‌ఎం ప్రభుదాస్ కృతజ్ఞతలు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: గంజాయి సాగు, రవాణాకు గిరిజనులు దూరంగా ఉండాలని సీఐ రమేష్ అన్నారు.మండలంలో బలపం పంచాయతీ వెలంజువ్వీ, ఎగజనబ, పనసలపాడు, లగుడంపల్లి, తడ్డపల్లి గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు గంజాయి సాగు, రవాణ వంటి అసాంఘిక కార్యకాలపాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయికి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా బాగా చదువుకోని ఉన్నత శిఖరాలను అందుకోవాలన్నారు. యువతకు వాలీబాల్ కిట్లును ఆయన అందజేశారు.

వై.రామవరం: చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, అందరికీ మంచిపేరు తీసుకురావాలని ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్ విద్యార్థినులకు సూచించారు. మండలంలోని యార్లగడ్డ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో సోమవారం విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్‌ఐ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు వినియోగం వలన కలిగే దుష్ప్రయోజనాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రతీ గిరిజన విద్యార్థిని బాగా చదివి, ఉన్నత శిఖరాలను అదిరోహించి గిరిజనప్రాంత సత్తాను చాటాలన్నారు. మంచి చదువులతో పాటుక్రీడల్లో రాణించి, ప్రపంచస్థాయికి చేరుకుని, తల్లిదండ్రులు, గురువులతో పాటు, గిరిజన ప్రాంతానికి, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకు రావాలని సూచించారు. మెరుగైన ఫలితాలు సాధించి, ఉన్నతశిఖరాలు అధిరోహించడానికి విద్యార్థినులకు సలహాలు సూచనలు ఇచ్చారు. హెచ్‌ఎం రూన్సీలక్ష్మి, పీఈటీ మంగాయమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్


డ్వాక్రా సంఘ మహిళలతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: ఏజెన్సీ 11 మండలాల్లోని ప్రకృతి వ్యవసాయ కార్మికులకు గత 17 నెలల నుండి వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని తక్షణమే వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కార్మికులు ఐటీడీఏ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు మట్ల వాణిశ్రీ ,పల్లపు వెంకట్ మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతుకి వ్యవసాయంలో మెలుకువలు నేర్పుతున్న ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫామింగ్‌లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించకుండా అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. 11 మండలాల్లో ప్రకృతి వ్యవసాయ కార్మికులు 280 మందికి 17 నెలలు వేతనాలు లేకపోవడంతో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులకు అనేకమార్లు వినతులు ఇచ్చినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ధర్నా కొనసాగిస్తామన్నారు. దీంతో అధికారులు ఈ విషయాన్ని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేకు ఫోన్‌లో తెలియజేయగా, 15 రోజుల్లో వేతన బకాయిలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

డ్వాక్రా సంఘ మహిళల ఆందోళన

దేవీపట్నం మండల డ్వాక్రా సంఘంలో అవినీతికి పాల్పని సీసీలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో సంఘ మహిళలు ఆందోళన చేశారు. సీపీఎం నాయకులు కిరణ్ తదితరులతో కలిసి ర్యాలీ చేశారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయం ఎదుట బైఠాయించారు. విషయం తెలుసుకున్న ఉపాధి ఏపీడీ అక్కడికి చేరుకొని డ్వాక్రా సంఘ మహిళలను సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. సమస్య పరిష్కరించేంత వరకు ఆందోళన చేస్తామని డ్వాక్రా మహిళలు తేల్చి చెప్పారు. సాయంత్రం 5గంటలకు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అక్కడికి వచ్చి విషయాన్ని తెలుసుకున్నారు. అవినీతి విషయంపై నివేదిక తయారు చేసి అందజేయాలని ఏపీవోను ఆదేశించారు. అనంతరం సీసీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రాన్ని పీవోకు అందచేశారు.

20న గిరిప్రదక్షిణకు ఏర్పాట్లు

- అన్నిశాఖలతో సమన్వయం
- కొండచుట్టూ 30 స్టాళ్ల ఏర్పాటు
- దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి

సింహాచలం : వచ్చేనెల 20న గిరి ప్రదక్షిణను వైభవంగా నిర్వహించేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. గిరిప్రదక్షిణ ఏర్పాట్లపై దేవస్థానం వైదికులు, ఇంజినీరింగ్ అధికారులు, పలు విభాగాల అధిపతులతో సోమవారం ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ గిరి ప్రదక్షిణకు లక్షలాది మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని, ప్రధానంగా నగరంలో 32 కిలోమీటర్ల మేర జరిగే ఉత్సవం కావడంతో అన్నిశాఖల సమన్వయంతో ముందుకువెళతామన్నారు. జీవీఎంసీ, పోలీస్, మెడికల్ తదితరశాఖల అధికారులకు లేఖలు రాయాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. అలాగే దాతలు, స్వచ్ఛంధ సంస్థలతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. 20వ తేదీన సాయంత్రం 4గంటలకు కొండదిగువన తొలిపావంచా వద్ద నుంచి పుష్పరథం ప్రారంభమవుతుందని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం గిరి ప్రదక్షిణ జరిగే పరిధిలో కొండచుట్టూ 30 స్టాళ్లను ఏర్పాటు చేస్తామని , 275 మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో అన్నిశాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో దేవస్థానం స్థానాచార్యులు టీపీ రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, డీఈ నాగేశ్వరరావు, ఏఈవోలు ఆనంద్‌కుమార్, రమణమూర్తి, రాజేంద్రకుమార్, నరసింగరావు, సూపరింటిండెంట్లు రాజ్యలక్ష్మి, సునీల్, కనకరాజు, పీఆర్వో నాయుడు పాల్గొన్నారు.

జూలై 20, 21తేదీల్లో ఆర్జిత సేవలు రద్దు

గిరిప్రదక్షిణ సందర్భంగా జూలై 20, 21వ తేదీల్లో ఆర్జితసేవలన్నీ రద్దు చేస్తున్నట్టు దేవస్థానం స్థానాచార్యులు టీపీ రాజగోపాల్ తెలిపారు. అలాగే దర్శనాల సమయాల్లో కూడా మార్పులు ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా 20న ఉదయం గిరిప్రదక్షిణ ప్రారంభించి రాత్రికే తిరిగి సింహాచలం చేరుకునే భక్తుల సౌకర్యార్థం ఆరోజు రాత్రి 10గంటల వరకు దర్శనాలు అందజేస్తామని తెలిపారు. అలాగే 21వ తేదీ తెల్లవారుజాము నుంచి సాయంత్రం 4గంటల వరకు దర్శనాలు ఉంటాయని తెలిపారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరగనున్న పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 కొత్తరోడ్డు బ్రాంచ్‌కు ఆన్‌లైన్‌పేమెంట్ చేయాలని వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

29న జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశం


మహారాణిపేట : ఈ నెల 29న జిల్లా పరిషత్ ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈవో) ఎం.పోలినాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో 29న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఒకటి నుంచి ఏడో స్థాయీ సంఘాల సమావేశాలు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు రెండు, ఐదో స్థాయీ సంఘాల సమావేశాలు, ఉదయం 11 గంటలకు నాలుగు, మూడో స్థాయీ సంఘ సమావేశాలు, అదేవిధంగా మధ్యాహ్నం 12 గంటలకు ఒకటి, ఆరు, ఏడో స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నందున సభ్యులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

మెగా జాబ్‌డ్రైవ్‌లో 172 మంది ఎంపిక


జాబ్ డ్రైవ్‌లో ఎంపికైన విద్యార్థులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల(అటానమస్), నిర్మాన్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కళాశాల ఎస్‌ఆర్‌సీ అండ్ జేకేసీ విభాగం మెగా జాబ్ డ్రైవ్ నిర్వహించింది. ఎస్ఆర్‌సీ అనుబంధ 8 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. 16 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 8 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి 436 మంది విద్యార్థులు పాల్గొనగా.. 172 మంది ఎంపికై నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. అభ్యర్థులు వారిలోని నైపుణ్యాలు పెంపొందించుకుని, ఇంటర్వ్యూను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

కేజీహెచ్ గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పద్మావతి


పద్మావతిని అభినందిస్తున్న సిబ్బంది

మహారాణిపేట: కేజీహెచ్ గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా సీహెచ్ పద్మావతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో గ్రేడ్ -2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన పద్మావతికి కేజీహెచ్‌కు పదోన్నతిపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానందను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేజీహెచ్ నర్సింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేయడంతో పాటు హెడ్ నర్స్, స్టాఫ్ నర్స్‌లను, కాంట్రాక్ట్ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు హెడ్ నర్స్‌లు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది పద్మావతికి అభినందనలు తెలిపారు.

రారండోయ్.. వేడుక చూద్దాం..

- 4 నుంచి జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు
- 7న తొలి రథయాత్ర
- 8 నుంచి స్వామి దశవతారాలు
- 18న తిరుగు రథయాత్ర


జగన్నాథ, సుభద్ర, బలభద్రస్వామి


ఆలయ ముఖ ద్వారం


రథయాత్రకు సిద్ధంగా ఉన్న స్వామి రథం

స్వామి అవతారాలు..

8న మత్స్యావతారం, 9న కూర్మావతారం, 10న వరహావతారం, 11,12న నృసింహావతారం, 13న వామనావతారం, 14న పరశురామావతారం, 15న శ్రీరామావతారం, 16న బలరామ-శ్రీకృష్ణావతారం, 17న తొలి ఏకాదశి, శేషపాన్పు అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

డాబాగార్డెన్స్: నగరంలోని టౌన్‌కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవం జూలై 4 నుంచి 19వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా 4న గురువారం జ్యేష్ట బహుళ చతుర్దశి, సాయంత్రం ప్రతిష్ఠా ప్రారంభ సంకల్పం, 5న అమావాస్య ఉదయం జలాధివాసములు, క్షీరాధివాసములు, రాత్రి విశేష హోమాలు, పంచశయ్యాది వాసములు, 6న ఆషాఢ శుద్ధ పాడ్యమి ఉదయం పూర్ణాహుతి నేత్రోత్సవం, సాయంత్రం 6.30 గంటలకు ధ్వజారోహనం, సుభద్రాదేవి శాంతి కల్యాణం జరపనున్నారు. 7న ఉదయం 9.20 గంటలకు స్వామిని రథంపైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 4.15 గంటలకు జగన్నాథస్వామి తొలి రథయాత్ర ఉత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. 8 నుంచి 17వ తేదీ వరకు టర్నర్ చౌల్ట్రీలో గల కల్యాణ మండపంలో దశావతారాల్లో స్వామి భక్తులకు దర్శనమిస్తారు.

తిరుగు రథయాత్ర..

18న ఉదయం 12.15 గంటలకు స్వామి రథంపైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 5.10 గంటలకు టర్నరు చౌల్ట్రీ నుంచి మేళ తాళాలు, బాణసంచా, మంగళవాయిద్యాల నడుమ జగన్నాథ నామ స్మరణతో వేద పండితుల పారాయణాలతో అత్యంత వైభోవపేతంగా తిరుగు రథయాత్ర నిర్వహించనున్నారు. 19న ఉదయం సంప్రోక్షణ, పీఠారోహణం అనంతరం స్వామిని యథాస్థానంలోకి పెట్టనున్నారు.

ఆలయ చరిత్ర..

మహా విశాఖ నగర మెయిన్‌రోడ్డులో వెలసిన జగన్నాథస్వామి ఆలయం 185 ఏళ్ల చరిత్ర కల్గిన అతిపురాతనమైన ఆలయం. ప్రశాంత వాతావరణంలో ఎంతో మంది కళాకారులకు ఆశ్రయాన్ని కలిగించి, వివిధ కళలకు నిలయమైన భక్తులపాలిట కల్పతరువైన మహావిష్ణువు వైష్ణవ దేవాలయంగా పేరుగాంచింది. 1832లో ప్రస్తుత ఆలయం ఉన్న ప్రాంతంలో గరుడా జగన్నాయకుల కుటుంబీకులు తవ్వకాలు జరిపినప్పుడు ఆలయంలో ఉనటువంటి మహావిష్ణువు రూపుడైన రంగనాథస్వామి పంచలోహ విగ్రహాలు బయల్పడ్డాయి. అప్పుడు స్వామికి చిన్న తాటి ఆకులపాకవేసి చలమయ్య దీక్షితులను అర్చకులుగా నియమించారు. అనంతరం గరుడా వంశీయుల ఆరాధ్యదైవమైన జగన్నాథ స్వామి దేవాలయ నిర్మాణానికి పూనుకొని, 1862లో ఆలయ నిర్మాణం పూర్తి చేసి ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన పూరీ నుంచి జగన్నాథ, సుభద్ర, బలభద్ర స్వామి విగ్రహాలను తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. 1864 నుంచి ఇక్కడ రథయాత్ర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

నిత్యపూజలు..

జూలై 8 నుంచి 17 వరకు నిత్యపూజలు నిర్వహించనున్నారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు స్వామి మేలుకొలుపు, నాదస్వరం, 6 నుంచి 7 వరకు నిత్యపూజ, ఉభయదాతల గోత్రనామాలతో పూజాధికములు, 7 నుంచి 9.30 గంటల వరకు జగన్నాథస్వామి ప్రార్థనాగానసంఘంచే ప్రార్థనా తరంగిణి. 9.30 నుంచి 10.30 వరకు లలితా సహస్రనామ పారాయణ, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సామూహిక భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 9 రోజుల పాటు పాల్గొనే భక్తులు దేవస్థాన కార్యాలయంలో రూ.500 చెల్లించినచో గోత్ర నామాలతో ఆయా రోజుల్లో పూజ జరిపించనున్నారు. దశావతార అలంకరణలు చేయుదలచే భక్తులు ముందుగా ఆలయ కార్యనిర్వాహణాధికారి టి.రాజగోపాల రెడ్డిని కార్యాలయంలో సంప్రదించవచ్చు.


ప్రధాన ఆలయం

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం(విశాఖ) : వెస్ట్ సెంట్రల్ రైల్వే, జబల్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునీకకరణ పనుల నిమిత్తం పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 27, జూలై 4వ తేదీన విశాఖపట్నంలో బయల్దేరాల్సిన విశాఖపట్నం-భగత్ కి కోటి (18573) వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 29, జూలై 6వ తేదీన భగత్ కి కోటిలో బయల్దేరాల్సిన భగత్‌కి కోటి-విశాఖపట్నం(18574) వీక్లీ ఎక్స్‌ప్రెస్, జూలై 5, 6, 9 తేదీల్లో విశాఖపట్నంలో బయల్దేరాల్సిన విశాఖపట్నం-అమృత్‌సర్ (20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్, జూలై 6,7,10వ తేదీల్లో అమృత్‌సర్‌లో బయల్దేరాల్సిన అమృత్‌సర్-విశాఖపట్నం (20808) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌లు రద్దయినట్లు పేర్కొన్నారు. విశాఖపట్నం-అమృతసర్(20807) వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 25, 28, 29, జూలై 2వ తేదీల్లో మల్‌ఖేడి స్టేషన్‌లో హాల్ట్‌ను తొలగించారు.

ఆరోగ్య మిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గోవింద్

అనకాపల్లి: రాష్ట్ర ఆరోగ్య మిత్ర ఎంప్లాయీస్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడిగా చవ్వాకుల గోవింద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో ఆయన్ను ఎన్నుకున్నారు. ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు భద్రం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మాకవరపాలెం ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న గోవింద్‌కు అభినందనలు తెలిపారు.